జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
బుధవారం | 28 | మే | 2025 ◆ పేజీలు : 6



## భవిత కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి



- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- భవిత కేంద్రాల నిర్వహణ, బడి బాట లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి: స్థానిక జిల్లాలోని భవిత కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో భవిత కేంద్రాల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 8 భవిత కేంద్రాలు, 14 నాన్ భవిత కేంద్రాలు ఉన్నాయన్నారు. రాబోయే 20 రోజుల్లోపు 8 భవిత కేంద్రాల్లో

మిగతా 2 లో...

● పేదలకు చుట్టంలా భూ భారతి చట్టం పని చేస్తుంది ● ధాన్యం కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు మీడియాకు అందించాలి ● అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలి ● మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు ● ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు టోకెన్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా ● జూన్ 3 నుండి జూన్ 20 వరకు అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి ● నకిలి విత్తనాల అమ్మే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి ● వానాకాలం ముందస్తు సాగు రైతులను సన్నద్ధం చేయాలి ● వానాకాలం పంట సాగుకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు ● అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల పంట వివరాలు సమర్పించాలి ● ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ శాఖ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎం







### ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో...
# కలెక్టర్ లు కీలక పాత్ర పోషించాలి
## సీఎం రేవంత్ రెడ్డి

ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి : స్థానిక ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు లో కలెక్టర్ లు కీలక పాత్ర పోషించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.మంగళవారం ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ శాఖ వంటి పలు అంశాల పై సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావులతో హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ...

మిగతా 2 లో...

## ప్రారంభోత్సవకు సిద్ధమైన ఖమ్మం మహిళా మార్ట్

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- సుస్థిర జీవనోపాధి లక్ష్యంగా మహిళా మార్ట్ ఏర్పాటు
- మహిళా మార్ట్ ను లాభాల బాటలో నడిపేలా అవసరమైన కార్యచరణ
- సీక్వెల్ రోడ్డులోని మహిళా మార్ట్ ప్రారంభ ఏర్పాటు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి: స్థానిక మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో

మిగతా 2 లో...

## ఆరోగ్య మహిళా క్లినిక్ ను సంధర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి కళావతి భాయ్



ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి : మంగళవారం ఉదయం పది గంటలకు ఖమ్మం అర్బన్ లోని పాత మునిసిపాలిటిలో ఏర్పాటుచేసిన ఆరోగ్య మహిళా క్లినిక్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి సందర్శించి మెడికల్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్, వైద్యశాఖ సిబ్బంది అందిస్తున్న ఓ.పి. సేవలను పరిశీలించారు. జిల్లాలోని వివిధ పి.హెచ్.సి.లు, యూ.పి.హెచ్.సి.ల ద్వారా ప్రతి మంగళవారం డాక్టర్లచే రెఫర్ చేసి పంపించబడిన మహిళలతో డి.ఎం.హెచ్.ఓ.డా.బి. కళావతి బాయి మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రతి మంగళవారం ఉచితంగా కార్పోరేట్ ఆసుపత్రుల

మిగతా 2 లో...

## భవిత కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

(మొదటి పేజీ తరువాయి...)

టాయిలెట్లు, వాష్ రూమ్ లు ఏర్పాటు చేయాలన్నారు. ఆకర్షణీయ పెయింటింగ్ వేయాలన్నారు. కేంద్రానికి కావాల్సిన పరికరాలు సమకూర్చాలన్నారు.ఎంత మంది పిల్లలకు రవాణా సౌకర్యం కావాలో గుర్తించి, రవాణా సౌకర్యానికి రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు.జిల్లాలో బడి బాట కార్యక్రమం పకడ్బందీగా కార్యాచరణ చేయాలన్నారు. జీరో నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంటింటికి వెళ్లి, తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, బోధనపై చైతన్యం తేవాలన్నారు. పాఠశాలల్లో మిగులు వసతుల కల్పన పనులు వెంటనే చేపట్టాలన్నారు. రి పెయింటింగ్, టాయిలెట్లు, సుందరీకరణ పనులు ఉంటే బడి బాట కార్యక్రమానికి ముందే చేపట్టాలన్నారు.రెసిడెన్షియల్ పాఠశాలల్లో భోజనం పై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. రుచి శుచికరమైన భోజనం పిల్లలకు అందేలా చూడాలన్నారు. సిబ్బంది, పిల్లలతో కలిసి భోజనం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సత్య నారాయణ, సీఎంఓ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## ఆరోగ్య మహిళా క్లినిక్ ను సంధర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి కళావతి భాయ్



(మొదటి పేజీ తరువాయి...)

స్థాయిలో మహిళలకు నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బందిచే లాబోరేటరీ పరీక్షలు, సేవలు, మందులు మరియు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తోందని తెలిపారు.మహిళలకు అందించే 8 ర కాల సేవ లు డయాబెటిస్ (మధుమేహం ), రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలతో పాటు ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ కు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టులు, థైరాయిడ్ టెస్ట్, అయోడిన్ లోపం, ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బీ 12, విటమిన్ డి పరీక్షలు, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి తగిన మందులను అందజేస్తున్నారు.మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ వ్యాధులకు సంబంధిచిన టెస్టులు, చికిత్సలు, నెలసరి సమస్యలపై పరీక్షలు చేసి వైద్యం అందిస్తున్నారు. పిల్లలు కాని మహిళలకు సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి అవగాహన కలిగిస్తూ, అవసరమైనవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు కూడా చేస్తున్నారు. మోనోపాజ్ దశకు సంబంధించిన టెస్టులు కూడా నిర్వహించి, రిపోర్ట్స్ ఆధారంగా అవసరమైన వారికి హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ కూడా చేస్తున్నారు. అంటువ్యాధుల పరీక్షలు చేసి, అవసరమైన వారికి వైద్యం అందిస్తున్నారు. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామం వంటివాటిపై అవగాహన కలిగిస్తున్నారు.జనన నియంత్రణ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు, రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రఫీ, అండాశయ , ఇతర క్యాన్సర్ల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నారు. హార్మోన్ పరీక్షలు నిర్వహించి చికిత్సలు కూడా చేస్తున్నారు కాబట్టి వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలు ఈ ఆరోగ్య మహిళా క్లినిక్ లను సందర్శించి ఆరోగ్యాన్ని పొందాలని, ఇక్కడ ఆరోగ్యం పట్ల ఇస్తున్న ఆరోగ్యవిద్య పట్ల అవగాహనా ఏర్పరచుకొని ఆరోగ్యంగా ఉండడమే కాకుండా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నివారణ చర్యలను తెలుసుకొని పాటించాలని, ఆరోగ్యవంతమైన మహిళలు కుటుంబానికి, సమాజానికి, దేశానికి వరం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి తెలిపారు. కార్యక్రమంలో డా. దేవిశ్రీ, డా. మెహెనాజ్, గురువమ్మ తదితరులు ఈరోజు సేవలు అందించారు.తదుపరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి పల్లె దవాఖాన 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, కోర్టుల సముదాయంలోని ప్రభుత్వ డిస్పెన్సరిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. కళావతి బాయి సంధర్శించి అందుతున్న సేవల గురించి పేషంట్లతో వాకబు చేశారు.

### ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో...

# కలెక్టర్ లు కీలక పాత్ర పోషించాలి

(మొదటి పేజీ తరువాయి...)

,గతం కంటే దాదాపు 22 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ తక్కువ సమయంలో కొనుగోలు పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి అభినందించారు. 90 శాతం పైగా రైతులు ధాన్యాన్ని విక్రయించి సంతోషంగా ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రానికి రుతు పవనాలు ముందుగా వచ్చిన కారణంగా కల్లాల వద్ద ధాన్యం తడిసిపోవడంతో కొంత మంది రైతులు ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని అన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు 48 గంటల్లో చెల్లింపులు పూర్తి చేశామని అన్నారు. 10 లక్షల 50 వేల మంది రైతుల దగ్గర్నుంచి 64 లక్షల మెట్రిక్ టన్నుల పైగా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేశామని, ప్రభుత్వం చేసిన మంచి పనిని చెప్పుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మెరుగ్గా పనిచేస్తున్నప్పటికీ బలంగా జరుగుతున్నాయని, వీటిని తిప్పికొట్టాల్సిన అవసరం మనందరి పై ఉందని అన్నారు. జిల్లాలో వచ్చే వ్యతిరేక వార్తలలో సత్యాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్ల పై ఉందని అన్నారు. గత 3 సంవత్సరాల ధాన్యం కొనుగోలు వివరాల తో కలెక్టర్ రెగ్యులర్ గా సర్క్యులేట్ చేయాలని సీఎం ఆదేశించారు.జిల్లాలో ఉన్న రైస్ మిల్లులను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా రైతులకు అన్యాయం చేయాలని మిల్లర్లు చూస్తే వెంటనే యాక్షన్ తీసుకోవాలని సీఎం సూచించారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల పరిహారం అందించేందుకు నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని ముఖ్యమంత్రి తెలిపారు.వర్షాలు ముందుగా రావడం వల్ల వ్యవసాయ శాఖ తన ప్రణాళిక లలో మార్పులు చేసుకోవాలని, రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉండాలని అన్నారు. విత్తనాల, ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలి విత్తనాల అమ్మే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు.భూ భారతి చట్టం ముందస్తుగా 4 పైలెట్ మండలాలను ఎంపిక చేసుకున్నామని, అనంతరం ప్రతి జిల్లాలో ఒక మండలానికి పైలట్ గా ఎంపిక చేసుకొని రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రజల నుండి వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించాలని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ ప్రజలను భూతం లా పీడించిందని, భూ భారతి చట్టం పేదలకు చుట్టంలా పని చేస్తుందని సీఎం తెలిపారు.పైలెట్ మండలాలో వచ్చిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మిగిలిన ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు 3వ విడత భూ భారతి రెవెన్యూ సదస్సులు అన్ని మండలలలో నిర్వహించాలని, దీనికి కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించడంతో పాటు భూ భారతి చట్టం పై అవగాహన కల్పించాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో ప్రభుత్వ పనితీరు కనిపిస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ లు పూర్తి స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు పర్యవేక్షించాలని అన్నారు. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను కలెక్టర్లు నియమించాలని, మేస్త్రీ చార్జిలు, నిర్మాణ పరికరాల ధరల నియంత్రణ ఉండాలని, అడ్డుగోడలు ధరలతో పేదలను మోసం చేయకుండా జాగ్రత్త వహించాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్దిదారులకు టోకెన్ జారీ చేసి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని అన్నారు. అక్రమ ఇసుక రవాణాను ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రోత్సహించే ఆస్కారం లేదని, ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక దోపిడీ జర్గకుండా జాగ్రత్త వహించాలని సీఎం సూచించారు. మహిళా సంఘాలు, యువత ద్వారా ఇటుక సెంట్రింగ్ యూనిట్ల తయారీ కేంద్రాల ఏర్పాటు చేయాలని సీఎం తెలిపారు.తక్కువ ధరతో నాణ్యమైన ఇండ్లు నిర్మాణం చేసేందుకు అనేక కొత్త పద్ధతులు, సాంకేతికత వచ్చాయని , వీటిని లబ్ధిదారులకు తెలియజేయాలని సీఎం తెలిపారు. మండల కేంద్రాలు నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల పరిశీలించేలా కార్యక్రమాలు రూపొందించాలని సీఎం తెలిపారు.జిల్లా కలెక్టర్లు, ఇంచార్జి మంత్రులు మే 29,30 తేదీలలో క్షేత్రస్థాయిలో పర్యటించి వానాకాలం సాగు ఏర్పాట్లు, నకిలీ విత్తనాలు, ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్ల, భూ భారతి పై రిపోర్టు తయారు చేసి జూన్ 1 నాటికి సమర్పించాలని అన్నారు. జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ,ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అన్నారు. జిల్లాలో ముందస్తు సాగు జరిగేలా రైతులను ప్రోత్సహించాలని అన్నారు.పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ,★ మే 26,2025 నాటికి యాసంగి సీజన్ లో ప్రభుత్వం 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, గత సంవత్సరం యాసంగి లో కొనుగోలు చేసిన ధాన్యం కంటే 22 లక్షల మెట్రిక్ టన్నుల అధికంగా కొనుగోలు చేయడం పట్ల మంత్రి అధికారులకు అభినందనలు తెలిపారు. యాసంగి ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరుకుందని, అకాల వర్షాల కారణంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉందని, వీటిని పూర్తి స్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని మంత్రి తెలిపారు.ధాన్యం రవాణా నిమిత్తం సమస్యలు రాకుండా రవాణా, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి అవసరమైన వాహనాలు అందుబాటులో పెట్టాలని, రైస్ మిల్లర్లు సహకరించని పక్షంలో ఇంటర్మీడియట్ గోదాములకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద ఎక్కడా హమాలీల కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులకు ధాన్యం చెల్లింపులు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన 48 గంటల లోగా పూర్తి చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశం పై ఎటువంటి వ్యతిరేక వార్తలు వచ్చినప్పటికీ ఆ వార్తను విచారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, తప్పుడు వార్తలు ప్రచారంలో ఉంటే వెంటనే ఖండించాలని మంత్రి ఆదేశించారు.వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ,మే నెలలోనే వర్షాలు రావడం చాలా సంతోషకరమైన అంశమని అన్నారు. వానాకాలం పంట సాగు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలని, విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా కలెక్టర్ లు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలో టాస్క్ ఫోర్స్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి విత్తనాల విక్రయం పర్యవేక్షించాలని, ఎక్కడా నకిలీ విత్తనాలు అమ్మకం జర్గవద్దని అన్నారు.రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లలో 15 శాతం మాత్రమే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, మిగిలిన ఇండ్ల పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇందిరమ్మ ఇండ్లలో పైలెట్ గ్రామాల్లో మంజూరు చేసిన ఇండ్లు మినహాయించి మిగిలిన ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, ఇప్పటి వరకు లక్షా 30 వేల మంది లబ్ధిదారులను అర్హులుగా ఎంపిక చేసినట్లు రిపోర్ట్ ఉందని మంత్రి తెలిపారు.భూ భారతి చట్టం కింద పైలెట్ మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించి జూన్ 2 నాడు పట్టాలు పంపిణీ చేయాలని అన్నారు.అసైన్మెంట్ భూముల సంబంధించి విక్రయం జరిగిన భూముల సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాల ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లకు జిల్లాల్లో శిక్షణ అందించే కార్యక్రమం ప్రారంభించామని, ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మాట్లాడుతూ,రుతుపవనాలు వస్తున్న నేపథ్యంలో పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు.వానాకాలం పంట సాగు కోసం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో పెట్టాలని, అకాల వర్షాల నుంచి రైతులను కాపాడేందుకు ముందస్తు సాగు ప్రోత్సహించాలని అన్నారు.ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, డిఎం సివిల్ సప్లై శ్రీలత, డిసిఎస్ఓ చందన్ కుమార్, పిడి హౌసింగ్ భూక్యా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఎస్డీసి రాజేశ్వరి, డిసిఓ గంగాధర్, అధికారులు, పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవకు సిద్ధమైన ఖమ్మం మహిళా మార్ట్

(మొదటి పేజీ తరువాయి...)

ఏర్పాటు చేసిన ఖమ్మం మహిళా మార్ట్ నేడు మంత్రులచే అధికారంగా ప్రారంభోత్సవంకు సంసిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు.మంగళవారం జిల్లా కలెక్టర్, సీక్వెల్ రోడ్డులోని ఖమ్మం మహిళా మార్ట్ ను సందర్శించి మంత్రులచే ప్రారంభోత్సవ ఏర్పాటు పనులను పరిశీలించారు. మార్ట్ లో ఏర్పాటు చేయు ఆర్గానిక్ ఉత్పత్తులు, మహిళాలచే చేసిన తినుబండారాలు, బొమ్మలు, ఎక్విప్మెంట్ లపై, ప్రొడక్ట్స్, స్వయం తయారీ ఇతర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఖమ్మం బ్రాండ్ మార్క్ ను పరిశీలించారు. మార్ట్ ఆకర్షణీయంగా ఉండే విధంగా కంప్యూటరైజ్ బిల్లు, లోగోల నిర్వహణ పట్ల అధికారులను కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళా మార్ట్ నిర్వహణపై మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించామని అన్నారు. మహిళా మార్ట్ ను లాభాల బాటలో నడిపేలా మహిళా సంఘాలకు ప్రత్యేక కార్యచరణ రూపొంచామని చెప్పారు. మహిళా మార్ట్ లో ఏ.సి. ఏర్పాటు ద్వారా ప్రతి నెలా కరెంట్ బిల్లు అధికంగా వస్తుందని, మహిళా మార్ట్ ప్రారంభించిన తర్వాత నిర్వహణ బాధ్యత స్వశక్తి మహిళా సంఘాలపై మాత్రమే ఉంటుందని, వీటిని పరిశీలించి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు.మహిళా మార్ట్ ముందు భాగంలో ఉన్న ఓపెన్ స్పేస్ లో రిటైల్ బిజినెస్ క్రింద ఏర్పాటు చేస్తున్న వాటిని, వర్షం వచ్చిన కూడా ఇబ్బంది లేకుండా నీడలో కూర్చొనే విధంగా సీటింగ్ అరేంజ్మెంట్ , పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళా మార్ట్ నిర్వహణ కట్టుదిట్టంగా ఉండాలని, సామాన్లు అందంగా పొందికగా అమర్చాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మహిళా మార్ట్ లో పెట్టే వస్తువుల స్టాక్ నిల్వలు పకడ్బందీగా భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పీఆర్ ఈఈ మహేష్ బాబు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాణోత్ మదన్ లాల్ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది

- మదన్ లాల్ మృతి పార్టీకి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటు
- మదన్ లాల్ భౌతిక కాయానికి నివాళ్లు అర్పించిన మాజీ ఎంపీ నామ, మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణోత్ మదన్‌లాల్ మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం నాడు ఖమ్మం నగరం లోని కవిరాజ్ నగర్ నందు ఉన్న మదన్ లాల్ నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలసి పూల మాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియా తో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి ప్రజా సమస్యల పై పోరాటం చేసిన నాయకుడు మదన్ లాల్ అన్నారు. గెలిచిన, ఓడిన ప్రజల పక్షాన నిలబడ్డారని పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఆయన పనితీరు అందరికీ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మదన్‌లాల్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తుంచేసుకుంటూ ఆయన నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి పార్టీకి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని నామ పేర్కొన్నారు. ఎమ్మెల్యే గా వైరా నియోజకవర్గంలో మదన్‌లాల్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఆయన ఎప్పుడు ప్రజల మధ్య ఉండే నాయకుడిగా పేరుగాంచారని, ఎల్లప్పుడూ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండేవారని తెలిపారు. నియోజకవర్గంలో సామాజిక న్యాయం కోసం ఎంతో పోరాడిన మదన్‌లాల్, గిరిజనుల సమస్యలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. చివరి దాకా పార్టీ పట్ల నిబద్ధతతో ఉన్నారని నామ తెలిపారు. మదన్ లాల్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు, అనుచరులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని నామ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నామ వెంట బిఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, వైరా బిఆర్ఎస్ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, దిశా కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జునరావు, మాజీ ఎంపీపీ సామినేని హరి ప్రసాద్, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మోరంపూడి ప్రసాదరావు, గొడ్డేటి మాధవరావు, బత్తుల శ్రీను, వాకదాని కోటేశ్వరరావు, ఏదునూరి శ్రీను, పాల్వంచ రాజేష్, సరిపూడి గోపి సందేశ్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, రాంబాబు, నరేష్ తదితరులు ఉన్నారు.

## మాదక ద్రవ్యాలు,డ్రగ్స్,మద్యపానం, ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ కి యువత బానిసలు కాకండి

- డి.వై.ఎఫ్.ఐ యువ చైతన్య సైకిల్ యాత్ర కరపత్రాల ఆవిష్కరణ.



**రఘునాథపాలెం** మండలం పరిధిలోనిచిమ్మపూడి గ్రామం లో డి.వై.ఎఫ్.ఐ సమావేశం మంగళవారం నీర్వహించడం జరిగింది.అనంతరం యువ చైతన్య సైకిల్ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించడం జరిగి ది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా డి.వై.ఎఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల.రమేష్ పాల్గొని మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యువతి యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది.ఈ సర్వేలో ప్రధానంగా వచ్చిన సమస్య యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని డ్రగ్స్ గంజాయి మద్యం మాదక ద్రవ్యాలు లాంటివి ముఖ్యంగా జిల్లాలో పట్నాల్లో గ్రామాల్లో కూడా డ్రగ్స్ గంజాయి విస్తరిస్తుందని ఇది మహమ్మారిగా మారి యువత,విద్యార్థులను బానిసలుగా మారుస్తుందని ఈ మత్తులో 17 సంవత్సరాల వయస్సు నుండి 40 సంవత్సరాల వయసున్నవారు ఎక్కువగా ఉన్నారని ఈ మాదక ద్రవ్యాలు వాడటం వలన అనేక శరీరక మానసిక ఆరోగ్య సమస్యలు వచ్చి చనిపోతు కుటుంబాలను విషాదంలో ముంచుతున్నారని ఆయన తెలిపారు.ఈ మాదక ద్రవ్యాల వల్ల యువత ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని యువత గంజాయి డ్రగ్స్ చెడు వ్యసనాలకి బానిస కావద్దని ఉద్దేశంతో యువతను చైతన్యవంతం చేయడం కోసమే ఈ యువ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామని,ఈ యాత్ర ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం జమలాపురం లో మే 30న ప్రారంభమై జిల్లా వ్యాప్తంగా జరుగుతుందని అన్నారు.ఈ సైకిల్ యాత్రలో యువతి, యువకుల,ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపుని చ్చారు.ఈ సమావేశంలో డి.వై.ఎఫ్.ఐ నాయకులు దొంతు.గణేష్, జోనే బోయిన.నవీన్, గాడిచర్ల.కోటేష్,గోపి, షేక్.నఫీర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ ఆత్మీయ వీడ్కోలు మహోత్సవం

- ప్రెస్ క్లబ్ -1 ఆధ్వర్యంలో తాహసిల్దార్ కు ఘన సన్మానం
- మండల ప్రజల ప్రశంసలు పొందడం ఆయన వృత్తికే గర్వకారణం
- విశేషమైన సేవలు అందించారని తాహాసిల్దార్ కు ప్రెస్ క్లబ్ సభ్యుల ప్రశంశలు

**బోనకల్, మే 27,(ప్రజాజ్యోతి):** ఇటీవలే బదిలీపై వెళ్లిన తాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ పూర్ణిమ దంపతులకి మండల కాంగ్రెస్ కమిటీ,మండల రెవెన్యూ అధికారుల ఆద్వర్యంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు,మంగళవారం శ్రీ సాయిబాబా ఫంక్షన్ హాల్ మందిరంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు,ఈ సందర్భంగా బోనకల్ ప్రెస్ క్లబ్–1 అధ్యక్షుడు దేగల వేలాద్రి ఆధ్వర్యంలో తాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్–పూర్ణిమ దంపతులను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు,ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి,గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్లు మాట్లాడుతూ జిల్లాలో 1 సంవత్సరం,9నెలల కాలంలో పున్నం చందర్ విశేషమైన సేవలు అందించారని,సామాన్యుల అధికారిగా తాసిల్దార్ పేరు పొందారని అన్నారు,వారు బదిలీపై వెళ్లిన చోట కూడా మంచి సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పున్నం చందర్ మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్,ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు యంగళ అమర్,ఉపాధ్యక్షులు మందా సత్యానంద, ట్రెజరర్ షేక్ బాజే షరీఫ్,వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బడే, గౌరవ సభ్యులు షేక్ పెంటూ సాహెబ్, కొణతాలపల్లి నాగేశ్వరారావు,సుగ్గల బ్రహ్మం,మాగి ముకేష్ తదితరులు ఉన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శర వేగంగా పూర్తి చేసుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు.



**నేలకొండపల్లి, మే 27 ప్రజా జ్యోతి :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను శర వేగంగా పూర్తి చేయాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మండలంలోని చెరువుమాధారం లోని రైతు వేదిక వద్ద చెరువుమాధారం, రాయగూడెం, ముజ్జిగూడెం, అనాసాగరం, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంగళవారం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... ప్రతీ పేదోడికి ఇందిరమ ఇళ్ల ను మంజూరు చేస్తుందని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఏడాదిలోనే అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, జిల్లా నాయకులు కొడాలి గోవిందరావు, మండల నాయకులు ఈవూరి శ్రీనివాసరెడ్డి, కె.నాగేశ్వరరావు, తుమ్మా ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో స్టూడియోలు బంద్ విజయవంతం



**నేలకొండపల్లి, మే 27 ప్రజా జ్యోతి :** ఫోటోగ్రాఫర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఫోటో స్టూడియో లు బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలో మంగళవారం ఫోటో స్టూడియోలు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల సత్యనారాయణ మాట్లాడారు...వృత్తిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఎన్నోఏళ్ల గా స్టూడియో ధరలను సవరణ చేయాలని కోరారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా స్టూడియో సేవలు ధరలు మారకపోవటం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని అన్నారు. కష్టమర్లు, ప్రభుత్వ అధికారులకు తెలియజేసేందుకు బంద్ ను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొలుసు ఆంజనేయులు, మండల కోశాధికారి వల్లాల ఉపేందర్, దండా సత్యనారాయణ, రామగిరి రవి, కొత్తకొండ వెంకట్, షేక్ మౌలానా, జెర్రిపోతులు అంజిని తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ మృతి పట్ల

- తుమ్మల దిగ్భ్రాంతి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక వైరా మాజీ శాసనసభ్యుడు బానోత్ మదన్ లాల్ అకాల మృతి పట్ల వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.అనారోగ్యంతో హైదరాబాద్ లోని ఆస్పత్రిలో చేరి ఈ ఉదయం మరణించినట్లు తెలిసి తుమ్మల నాగేశ్వరరావు దిగ్భ్రాంతికి లోనయ్యారు,నమ్మలేకపోయారు.మదన్ లాల్ తనకు సన్నిహితుడని, బీఆర్ఎస్ నాయకుడిగా, ఎమ్మెల్యే గా వైరా నియోజకవర్గానికి,ప్రజలకు విశేష సేవలందించారని, అకాల మృత్యువుకు లోనవ్వడం తీవ్ర బాధాకరమని తుమ్మల నాగేశ్వరరావు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.ఆయన మృతితో, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు,వైరా నియోజకవర్గ ప్రజలు నిబద్ధత కలిగిన నాయకుడని కోల్పోయారని,తీరని లోటని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మదన్ లాల్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తుమ్మల నాగేశ్వరరావు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు,ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

## కడపలో తెదేపా మహానాడుకు తరలిన మండల నాయకులు



**తల్లాడ, మే 27 (ప్రజా జ్యోతి ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపలో జరిగే 2025 తెలుగుదేశం పార్టీ మహానాడు 27,28,29 మూడు రోజుల జరగనుంది. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా తల్లాడ మండల టీడీపీ మండల నాయకులు మంగళవారం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కూచిపూడి వెంకటేశ్వరరావు, దూపాటి భద్ర రాజు, మొక్క క్రిష్ణర్జున్, దుగ్గినేని వెంకటేశ్వర్లు, నున్నా రామారావు, కొత్తపల్లి దానయ్య, గోడ్లవెంకట రత్నం, గొడ్ల రవి పాల్గొన్నారు.

## మదన్ లాల్ మృతికి మంత్రి పొంగులేటి సంతాపం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ లాల్ మృతి పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గతంలో వైసీపీ, బీఆర్ఎస్ లో ఉన్నపుడు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మదన్ లాల్ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థించినట్లు తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుడు నరేష్ కు ఆర్థిక సహాయం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక వైఎస్ఆర్ నగర్ కు చెందిన మంచికంటి నరేష్ (55) కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ అయ్యి దెబ్బలు తగిలి చికిత్స పొందుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు వైఎస్ ఆర్ నగర్ లో ఇంటికి వెళ్లి పరామర్శించి, కొంత ఆర్థిక సహాయం చేసి మీకు, మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చిన తోటి ఉద్యమకారుడు, బిసి సంఘ నాయకులు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ , నాయి బ్రాహ్మణ నగర కమిటీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## యనమాల విజయ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే రాగమయి.

**సత్తుపల్లి మే27(ప్రజా జ్యోతి )** స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఓ దినపత్రిక విలేఖరి యనమల విజయ్ ఇటీవల అనారోగ్యానికి గురి అయ్యారు. హైదరాబాదులోని హాస్పిటల్ లో వైద్యం చేపించుకొని మంగళవారం సత్తుపల్లి కి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వారి స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై వివరాల అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



# ఘనంగా పండిట్ జీ జవహర్ లాల్ నెహ్రూ 61వ వర్ధంతి

- **జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు**
- **పువ్వాళ్ళ దుర్గాప్రసాద్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజి శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి లు మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధాని, భారత స్వాతంత్ర్య పోరాట నాయకుడు. పండిత్‌జీ గా, చాచా నెహ్రూ గా ప్రాచుర్యం పొందిన ఈయన రచయిత, పండితుడు, చరిత్రకారుడు కూడా. భారత రాజకీయలలో శక్తివంతమైన నెహ్రూ–గాంధీ కుటుంబానికి ఈయనే మూల పురుషుడు. అని అదేవిధంగా భారత ఆర్థిక రంగానికి అనువుగా సవరించిన రాజ్య ప్రణాళిక, నియంత్రణ విధానానికి నెహ్రూ అధ్యక్షుడిగా ఉన్నారు. నెహ్రూ, భారత ప్రణాళికా సంఘంన్ని నెలకొల్పి, 1951 లో మొదటి పంచ–వర్ష ప్రణాళికను రచించి, అందులో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో ప్రభుత్వ పెట్టుబడులను పొందుపరిచారు. వ్యాపార, ఆదాయ పన్ను పెరుగుదలతో, నెహ్రూ ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో కీలక పరిశ్రమలైన మైనింగ్, విద్యుత్, భారీ పరిశ్రమలు, పౌర సేవలతో ప్రైవేటు రంగాన్ని అదుపులో వుంచే మిశ్రమ ఆర్థిక విధానాన్ని యోచించారు. నెహ్రూ భూ పునఃపంపిణి విధానాన్ని అనుసరించడంతో పాటు నీటి పారుదలకు కాలువలు త్రవ్వించడం, ఆనకట్టలు కట్టించడం, వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కమ్యూనిటీ అభివృద్ధి పథకాలకు దారి తీసే లక్ష్యంతో గ్రామీణ భారత సామర్థ్యాన్ని ఇనుమడించే వివిధ కుటీర పరిశ్రమలను విస్తరింపచేసారు. భారీ ఆనకట్టలను,బహుళార్ధ సార్ధక ప్రాజెక్ట్ లు ('నెహ్రూ వీటిని భారత దేశ ఆధునిక దేవాలయాలు' అనేవారు ) ప్రోత్సహించడం, నీటిపారుదల సౌకర్యాల కల్పన, జలవవిద్యుత్ ఉత్పత్తితో పాటు, నెహ్రూ భారతదేశ అణుశక్తి కార్యక్రమాలను కూడా ప్రవేశ పెట్టారు. భారత దేశ బాలలు, యువకులు విద్యను అభ్యసించాలనే తీవ్రమయిన కోరికగల నెహ్రూ, భారతదేశ భవిష్యత్ అభివృద్ధికి అది అత్యవసరమని భావించారు. ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్, ది ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ మానేజ్మెంట్ వంటి అనేక ఉన్నత విద్యా సంస్థలను ఆయన ప్రభుత్వం నెలకొల్పింది. భారత దేశ బాలలందరికీ నిర్బంధ, ఉచిత ప్రాథమిక విద్య అందించాలనే సంకల్పాన్ని నెహ్రూ తన పంచ–వర్ష ప్రణాళికలలో ప్రతిపాదించారు. దీని కోసం నెహ్రూ మూకుమ్మడి గ్రామ భర్తీ కార్యక్రమాలను, వేలాది పాఠశాలల నిర్మాణాన్ని పర్యవేక్షించారు. అంతేకాక బాలలలో పోషకాహార లోప నివారణకై ఉచిత పాలు, ఆహార సరఫరా ప్రారంభించడానికి చొరవ తీసుకున్నారు. వయోజనుల కొరకు, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల వారికోసం, వయోజన విద్యా కేంద్రాలు, వృత్తి, సాంకేతిక విద్యా పాఠశాలలు కూడా నిర్వహించారు. కుల వివక్షను శిక్షార్హమైన నేరంగా పరిగణించుటకూ, స్త్రీల న్యాయపరమైన హక్కుల కోసమూ, సాంఘిక స్వతంత్రతకూ, హిందూ చట్టంలో పలు మార్పులను నెహ్రూ ఆధ్వర్యంలోని భారత పార్లమెంటు చేసింది. షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలు ఎదుర్కొంటున్న సాంఘిక అసమానతలను, అననుకూలతలను రూపుమాపడానికి ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో రిజర్వేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసారు. నెహ్రూ లౌకికవాదానికి, మత సామరస్యానికి, ప్రభుత్వంలో అల్ప సంఖ్యాక వర్గాల ప్రాతినిధ్యానికి పూనుకున్నారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, వేజండ్ల సాయికుమార్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్,మొక్కా శేఖర్ గౌడ్, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, రాపర్తి శరత్ కుమార్,పల్లెబోయిన భారతి చంద్రం,మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, కొంటెముక్కల నాగేశ్వరరావు, శ్రీనివాస్, జహీర్ భాయ్,రజి భాయ్, కమతం రామకృష్ణ, దొడ్డా ప్రవీణ్, గడ్డం వెంకటయ్య, భూక్యా సురేష్ నాయక్, పర్వత శ్రీనివాస్, బోడ శ్రావణ్,నూకారపు వేంకటేశ్వరరావు ,యూసఫ్,బండి నాగేశ్వరరావు,కాళంగి కనకరాజు,బీరెడ్డి రమేష్,యాసబోయిన శ్రీశైలం, బెజ్జం గంగాధర్, జాని,వాసిం భాయ్, ముజాహిద్దీన్, మహమూద్,తిరుమలశెట్టి జయప్రకాశ్,రమణ,ఊరుకొండ చంద్రిక, సమీరా, బలుసు లక్ష్మి , జ్యోతి, కొత్తపల్లి పుష్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు





**కల్లూరు మే 27(ప్రజా జ్యోతి):** స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ ఉయ్యూరి శ్రీవ్యాల్ జన్మదినం సందర్భంగా పట్టణ కేంద్రంలోని పలుచోట్ల స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు, వాలంటీర్లు ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ చంద్రశేఖర్,పంచాయతీ ఈఓ నాగేశ్వరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీపీ ఎస్ స్కూల్ నందు శ్రమదానంలో బాగంగా క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించడం జరిగింది.గవర్నమెంట్ హాస్పటల్ నందు డాక్టర్ నవ్యకాంత్ ఆధ్వర్యంలో 50 మందికి బ్రెడ్, ఆపిల్,అరటి పండ్లు పేషంట్లకి పంపిణీ చేయడం జరిగింది. అదేవిదంగా కల్లూరు బస్టాండ్ నందు ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తదనంతరం స్ఫూర్తి ఫౌండేషన్ ఆఫీస్ నందు కుటుంబ సభ్యులు అందరూ కలిసి శ్రీ వ్యాల్ జన్మదిన వేడుక పుచ్చకాయ కట్ చేసి అందరికీ పంచారు.ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ కుటుంబ సభ్యులు,ప్రముఖులు ఆర్టీసీ సిబ్బంది,వైద్య సిబ్బంది, ప్రయాణికులు,ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ బాలాజీని సన్మానించిన వాలీబాల్ క్రీడాకారులు



**తల్లాడ, మే 27 ( ప్రజాజ్యోతి ):** తల్లాడ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్ళిన పోలీస్ కానిస్టేబుల్ బానోతు బాలాజీని తల్లాడలోని వాలీబాల్ క్రీడాకారులు మంగళవారం సన్మానించారు. వాలీబాల్ టీం పెద్దలు గరిడేపల్లి వెంకటేశ్వరరావు జివిఆర్, అధ్యక్షులు ధరావత్ కృష్ణ ఆధ్వర్యంలో ఆయనను శాలువాలు పూలమాలలతో సన్మానించి సత్కరించారు. రానున్న రోజుల్లో ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి ఉన్న జ్ఞాపకాలను వారందరూ నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అద్దంకి రవి, మొక్క సైదులు, పెరిక శీను, తోట సంపత్, శ్రీకాంత్, తమ్మి యాసిన్, దాదా, సత్తి మార్చ్, అక్షయ్, భార్గవ్, బెల్లంకొండ కృష్ణయ్య, నాగ పుల్లారావు, శ్రీనివాసరావు తదితరు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ మృతి పట్ల ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

**సత్తుపల్లి మే27(ప్రజా జ్యోతి )** వైరా నియోజకవర్గ సభ్యుడు బానోతు మదన్ లాల్ అకాల మృతి పట్ల సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యం కారణంగా హైదరాబాదులోని ఏఐజి హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని, ఆయన ప్రజలకు ఎన్నో సేవ కార్యక్రమాలను అందించారని, ఆయన పరిపాలన లో వైరా నియోజకవర్గాన్ని ఎంత అభివృద్ధి చేశారని తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకున్నారు.

# భూభారతి చట్టం అమలులో సర్వేయర్ల పాత్ర కీలకం

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- శిక్షణ పొందిన సర్వేయర్లు భూ హద్దులలో రైతులకు న్యాయం చేయాలి
- ల్యాండ్ సర్వేయర్ల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- టిటిడిసి లో నిర్వహిస్తున్న లైసెన్స్ సర్వేయర్ల్లల శిక్షణ కార్యక్రమంలో దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.మంగళవారం స్థానిక టిటిడిసి భవనంలో సర్వే, ల్యాండ్ రికార్డు శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. భూ భారతి చట్టం, భూ సమస్యలపై సమగ్ర అవగాహన, భూ మ్యాప్,నక్షా,భూ హద్దులు తదితర విషయాలపై స్పష్టంగా సర్వేయర్ల అవసరమని వారి విధుల పై అవగాహన కల్పిస్తు కలెక్టర్ వారికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో లైసెన్స్డ్ సర్వేయర్లు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది లైసెన్సుడ్ సర్వేయర్లను ఎంపిక చేసి, శిక్షణ అందించి అర్హత సాధించిన వారికి లైసెన్సులను జారీ చేయనుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారికి శిక్షణ కోసం ఎంపిక చేశామని అన్నారు. 50 రోజుల పాటు వీరికి భూముల సర్వేలో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన వారిచే శిక్షణ ఇస్తున్నామని వివరించారు.భూభారతి చట్టంలో పొందుపర్చిన సెక్షన్ ల ప్రకారం భూముల క్రయవిక్రయాలు, సక్సేషన్ వంటి వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో భూముల సర్వే జరిపి మ్యాప్ లను రూపొందించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వ్యవసాయ భూములకు కూడా సర్వే మ్యాప్ లను జతచేయాలని భూభారతి చట్టంలో పొందుపర్చిందని స్పష్టం చేశారు. ఈ మేరకు లైసెన్సుడ్ సర్వేయర్లు సర్వే జరిపి భూముల హద్దులు, సమగ్ర వివరాలతో సర్వే మ్యాప్ లను సమర్పిస్తే, వాటిని ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి ఆమోదించిన మీదట పట్టా పాస్ బుక్ కు జతచేయడం జరుగుతుందని తెలిపారు.పట్టా పాస్ బుక్ లు కలిగిన రైతులు ఎవరైనా సరే సర్వే మ్యాప్ కోసం దరఖాస్తు చేసుకుని, లైసెన్సుడ్ సర్వేయర్లచే సర్వే చేయించుకోవచ్చని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతి భూమి పార్సిల్ కు ఆధార్ తరహాలో భూధార్ నెంబర్ ను కేటాయించనుందని, దీని కోసం కూడా లైసెన్సుడ్ సర్వేయర్ల సేవలు అవసరం అవుతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని శిక్షణ సందర్భంగా నేర్పించే అంశాలను చక్కగా ఆకళింపు చేసుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.లైసెన్స్ సర్వేయర్లకు గెట్టు, భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు తదితర అంశాలపై థియరీ క్లాసులతో పాటు క్షేత్రస్థాయిలో చెయిన్ సర్వే, మ్యాప్ రీడింగ్ వంటి వాటి గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. భూ సంబంధిత సమస్యలలో అత్యధికంగా సర్వేతో ముడిపడిన అంశాలే ఎక్కువగా ఉన్నందున లైసెన్సుడ్ సర్వేయర్లు చక్కగా సేవలందిస్తే, అనేక భూ సమస్యల దరఖాస్తులు పరిష్కారం అవుతాయని, తద్వారా భూ వివాదాలకు తావు లేకుండా చేయాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని అన్నారు.సర్వేయర్ల శిక్షణలో ఎలాంటి సందేహాలు ఉన్నా, ఏమాత్రం సంశయానికి లోను కాకుండా వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. 50 రోజుల పని దినాలలో కొనసాగే శిక్షణ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో పాటు తాను కూడా ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షిస్తానని అన్నారు. భూభారతి చట్టం గురించి అవగాహన ఏర్పర్చుకుని, భూముల సర్వే విధానాన్ని సమగ్రంగా నేర్చుకుంటే లైసెన్సుడ్ సర్వేయర్ గా చక్కటి ఆదాయ వనరులను పొందవచ్చని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను నిర్వహిస్తుందని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అయిన లైసెన్సుడ్ సర్వేయర్లుగా ప్రభుత్వం గుర్తింపు పత్రాలను జారీ చేస్తుందని కలెక్టర్ తెలిపారు.భూ భారతి చట్టం ద్వారా భూములు లావాదేవీలు జరిగినప్పుడు సర్వే చేసి హద్దులను నక్షాల్లో పొందుపరిచిన తరువాత రిజిస్ట్రేషన్లు జరుగుతాయని దీనివల్ల తగాదాలకు చోటు ఉండదని కలెక్టర్ తెలిపారు.నిరుద్యోగులు ఈ ట్రైనింగ్ పూర్తి చేసి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం నూతన సర్వేయర్లకు శిక్షణ మెటీరియల్ ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏ డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాయిల పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- బాలికలు సమయపూర్తితో సమాజంలో ధైర్యంగా ముందుకు సాగాలి
- సోషల్ మీడియా పట్ల అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలి
- రిక్కాబజార్ హై స్కూల్ లో నిర్వహిస్తున్న బాలికల రక్షణ, హ్యూమన్ ట్రాఫికింగ్ పై స్కూల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక బాలికల భద్రత పట్ల ప్రభుత్వ ప్రాధాన్యతలో మొదటి అంశంగా ప్రత్యేక రక్షణ వ్యవస్థ కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.మంగళవారం స్థానిక రిక్కాబజార్ హైస్కూల్ నందు స్కూల్ అసిస్టెంట్ లకు నిర్వహించిన బాలికల రక్షణ, హ్యూమన్ ట్రాఫికింగ్ పై శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో బాలికల భద్రత, హక్కులు, మానవ అక్రమ రవాణా నివారణ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అమ్మాయిలకు కలిగే ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులను గుర్తించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అమ్మాయిలు అనుమానాస్పద వ్యక్తులతో మాటలాడే ముందు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ మహిళలు పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినట్లయితే, తక్షణమే అప్రమత్తం ఉండేలాగా అమ్మాయిలకు ధైర్యం కల్పించాలని వివరించారు.విద్యార్థుల మానసిక, శారీరక మార్పులను గమనిస్తూ అవసరమైన సందర్భాల్లో సలహా, సహాయం ఉపాధ్యాయులు అందించాలని తెలిపారు. సిబ్బందికి బాలికల పట్ల చైతన్యవంతమైన శిక్షణ, వర్క్‌షాప్‌లు నిర్వహించడం ముఖ్యమని అన్నారు.విద్యార్థులు భద్రంగా ఉండాలంటే ఉపాధ్యాయులు ముందుగా అప్రమత్తంగా ఉండాలని, మానవ అక్రమ రవాణా వంటి మానవతా విరుద్ధ చర్యలను ఎదుర్కొనేందుకు స్కూల్ అసిస్టెంట్ల పాత్ర ఎంతో కీలకం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిస్టు సివిల్ బ్రాంచ్ విద్యార్థులకు ట్రైనింగ్ ప్రోగ్రాం




**సత్తుపల్లి మే27(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల మదర్ తెరిసా ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో ఇంజనీరింగ్ సివిల్ బ్రాంచ్ విద్యార్థులకు 10 రోజులు పాటు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ మంగళవారం తెలియజేశారు. ఈ ప్రోగ్రాం కాంటర్ క్యాడ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాడ్ ప్రో అనే సాఫ్ట్వేర్ ద్వారా సివిల్ ఇంజనీరింగ్ విభాగాలలో ఆధునిక నిర్మాణం, విశ్లేషణ చేయడానికి రూపొందించ డానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.ఇలాంటి కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఈ ట్రైనింగ్ ప్రోగ్రామును సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంటర్ క్యాడ్ నిర్వాహకులు రాహుల్ కుమార్, ఈఈఈ నిర్వాహకులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, సివిల్ ఇంజనీర్ విభాగాధిపతి ఎల్ ఎస్ ఇంద్రసేనారెడ్డి, కన్వీనర్ ఎస్ డి సాజిద్, సివిల్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ యువకుడు మృతి



**సత్తుపల్లి మే27(ప్రజా జ్యోతి) :**డీసీఎం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తున్న పార్శపు కళ్యాణ్(25) సోమవారం సాయంత్రం సత్తుపల్లి నుండి గంగారం వైపు ద్విచక్ర వాహనంపై వెళు తుండగా డీసీఎం వ్యాన్ ఢీ కొట్ట డంతో తీవ్ర గాయాలు అయ్యాయి. 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతుడికి భార్య రితిష ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మదన్ లాల్ మరణం పట్ల మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముళ్లపాటి సీతారాములు తీవ్ర దిగ్బ్రాంతి

**వైరా (ప్రజాజ్యోతి)** బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వైరా నియోజకవర్గానికి మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్ లాల్ అకాల మరణం ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటుగా ముళ్లపాటి సీతారాములు పేర్కొన్నారు.మదన్ లాల్ శాసన సభ్యునిగా , పార్టీ అభివృద్ధికి, బలమైన నాయకత్వాన్ని స్థాపించేందుకు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.అయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# తల్లాడ ఎస్సై కొండలరావు బదిలీ




**తల్లాడ, మే 27 (ప్రజా జ్యోతి);** తల్లాడ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బి. కొండలరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల నుండి ఉత్తర్వులు అందాయి. సాధారణ బదిలీ ల్లో భాగంగా ఇక్కడినుండి ఖమ్మం త్రీ టౌన్ కు బదిలీ అయ్యారు. సుమారు రెండేళ్లు పనిచేసి న ఆయన మండలంలో తనదైన శైలిలో విధులు నిర్వహించారు.రాజకీయ చైతన్యం కలిగిన తల్లాడలో పోలీస్ ఉద్యోగం కత్తి మీద సామే. వాటన్నిటిని ఎదుర్కొని ప్రజలకు సేవలందించడంలో సఫలీకృతులయ్యారు. నూతన ఎస్సైగా ఖమ్మం సీసీఎస్ నుండి ఎన్. వెంకటకృష్ణ తల్లాడలో బాధ్యతలు చేపట్టనున్నారు.

# మదన్ లాల్ మృతికి మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక వైరా మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్ లాల్ అకాల మరణం పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వైరా నియోజకవర్గానికి మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్ లాల్ అకాల మరణం ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటుగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.మదన్ లాల్ పార్టీ అభివృద్ధికి, బలమైన నాయకత్వాన్ని స్థాపించేందుకు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.అయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## కాకరవాయి చౌడమ్మ జాతరలో ప్రత్యేక పూజలు

- పొంగులేటి కార్యాలయం ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి.



**తిరుమలాయపాలెం, మే 27, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో మంగళవారం యాదవుల ఆరాధ్య దైవం చౌడమ్మ తల్లి జాతరలో పొంగులేటి కార్యాలయం ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జాతరలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చౌడమ్మ తల్లి జాతర ఎంతో భక్తిశ్రద్ధలతో చేయడం ఆనందదాయకమని ఆయన అన్నారు. యాదవులందరూ ఐక్యమత్యంతో కలిసి మెలిసి ఉండాలని ఆ తల్లి దీవెనలతో ప్రజలు చల్లగా ఉండాలని ఆయన అమ్మవారి జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దయాకర్ రెడ్డి రాక సందర్భంగా భక్తుల ఆనంద ఉత్సవాల కేరింతల మధ్య పండుగ కోలహాలంగా సాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, కొప్పుల అశోక్, బుద్ధ కనకయ్య, గూడూరు ఉపేందర్, గుండాల ఎల్లయ్య, దామర్ల కృష్ణ, కొత్తపెల్లి కృష్ణ, పల్ల వెంకన్న, ఏనుగంటి కృష్ణ, వీరబోయిన ఉపేందర్, కొత్తపెల్లి మల్లయ్య, ధర్మపురి ముత్తయ్య, బండారి శ్రీను, గూడూరు ఉమ్మయ్య, దామర్ల సతీష్, సురిగి రాములు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి మే27(ప్రజా జ్యోతి)** నిరుపేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి,పెనుబల్లి,వేంసూర్ మండలాలకు సంబంధించి రూ..14,36,500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబాలకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలు అయి ఉండి,కార్పొరేట్ హాస్పటల్లో వైద్యం చేపించుకున్న వారికి ఇవి ఎంతగానో దోహదప డతాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వలన నిరుపేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, మండల పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి,నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## భారతదేశానికి ఆదర్శప్రాయుడు చాచా నెహ్రూ ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి మే27(ప్రజా జ్యోతి)** భారతరత్న,జవహర్లాల్ నెహ్రూ 61వ వర్ధంతి వేడుకలను పట్టణంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో, సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి ఘనంగా పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశానికి ఎనలేని కృషి నెహ్రూ,మహాత్మా గాంధీ చేశారని, భారతదేశంలో ప్రతి పౌరుడు ఇంత స్వేచ్ఛగా ఉంటున్నారు అంటే వారి కృషి మరువలేనిదని అన్నారు. ఆనాడే పిల్లలకు ఇష్టమైన వ్యక్తిగా,దేశానికి ఎనలేని సేవలు అందించి నారని తెలియజే శారు. నేను కూడా వారి బాటలో పయనించి, ప్రజలకు మరెన్నో సేవలు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లగుండ్ల నరసింహారావు, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు,గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి,కమల్ పాషా, షరీఫ్,రామారావు, మట్టా చెన్నారావు, మానుకోట ప్రసాద్,యూనిస్, రఫీ, మధు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



## మాజీ తాహాసిల్దార్ సేవలపై మండల ప్రజా ప్రతినిధులు ప్రశంసలు

- మండల కేంద్రంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు మహోత్సవ కార్యక్రమం
- అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకుల సహాయం మరువలేనిది...
- మాజీ తాహాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్
- సౌమ్యుడిగా,వివాద రహితుడిగా పేరు తెచ్చుకోవడం అభినందనీయం
- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు
- సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంలో పున్నం చందర్ దిట్ట
- ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామ కోటేశ్వరరావు





**బోనకల్,మే 27,(ప్రజాజ్యోతి):** ఇటీవలే బదిలీపై వెళ్లిన తాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ పూర్ణిమ దంపతులకి మండల కాంగ్రెస్ కమిటీ,మండల రెవెన్యూ అధికారుల ఆద్వర్యంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.మంగళవారం శ్రీసాయిబాబా ఫంక్షన్ హాల్ మందిరంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు, ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు మాట్లాడుతూ పున్నం చందర్ తాహసిల్దారుగా పదవి బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి బదిలీ అయ్యేవరకు ప్రతి సమస్యను సానుకూలంగా పరిష్కరించడమే కాకుండా సౌమ్యుడిగా, వివాద రహితుడిగా పేరు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు, మాజీ తాహాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ మాట్లాడుతూ ప్రజాభివృద్ధి,సంక్షేమం అంశాల్లో మండలం ముందుండాలని ఆకాంక్షించారు.ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని,మనకు అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలో ప్రతిశాఖ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. గత 1 సంవత్సరం 9నెలల కాలం చాలా మంచిగా గడిచిందని,ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయడంలో, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేయడంలో తనకు స్థానిక ప్రజాప్రతినిధులు,మండల అధికారులు, కార్యాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరించారన్నారు.విద్యా వ్యవస్థలో మంచి మార్పులు తీసుకొని వచ్చే దిశగా ప్రతి బుధవారం పాఠశాలల సందర్శన లాంటి వినూత్న కార్యక్రమాలను అధికారులు, సిబ్బంది కృషితో పర్యవేక్షణ చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వ విధులను పకడ్బందీగా నిర్వహిస్తే పేరు ప్రఖ్యాతలు వాటి అంతట అవే వస్తాయి అన్నారు, తనకు అన్ని విధాలుగా సహకరించిన మండల ప్రజా ప్రతినిధులకు,వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, మీడియా ప్రతినిధులకు తహసీల్దారు పున్నం చందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ మద్దెల రమాదేవి,ఆర్ఐ లు నవీన్ కుమార్,మైథిలి,పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్,మధిర నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామ కోటేశ్వరరావు,మాజీ జెడ్పిటిసిలు మోదుగు సుధీర్ బాబు,బానోత్ కొండ,టీపిసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు,బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జున రావు, తెలుగుదేశం మండల కార్యదర్శి కొంగర జగన్,వైఎస్ఆర్సిపి మండల నాయకులు ఇరుగు జ్ఞానేష్,డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు మాజీ సర్పంచులు వెంగళ అమర్ దయామ ని, ఎర్రంశెట్టి సుబ్బారావు,జెర్రిపోతుల రవీందర్,బీపీ నాయక్, భాగం నాగేశ్వర రావు,మారూపల్లి ప్రేమ్ కుమార్, బంధం మార్కెట్ కమిటీ, ఆత్మ కమిటీ డైరెక్టర్లు మీడియా ప్రతిని ధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సస్చంద సేవ సంస్థ స్థలం కేటాయింపు కొరకు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కమిషనర్ ని కలిసిన సేవా సంస్థ నిర్వాహకులు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** స్థానిక ఖమ్మం పట్టణంలో గత పది సంవత్సరాలుగా షైనింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ రిజిస్ట్రేషన్ నెం:133/2023 పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజాధరణ పొంది ఎటువంటి లాభపేక్ష లేకుండా నిరుపేదలకు విద్య ఉపాధి విపత్తుల సమయాల్లో మా బృందముతో సహాయక చర్యలు అదేవిధంగా అట్టి సమయాల్లో వారికి కావలసినటువంటి సామాగ్రి దుప్పట్లు మంచి సదుపాయాలు భోజనాన్ని అందించడం రక్తదానం అనాధలను అక్కున చేర్చడం దూరప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు సైకిల్ పంపిణీ ముఖ్యముగా ట్రైబల్ ఏరియాలో విద్యకు పెద్దపీఠం వేస్తూ పుస్తకాల పంపిణీ స్కూల్ ఏర్పాటు చేయడం సోలార్ గ్యాస్ స్టవ్ మంచాలు అందించడం తదితర కార్యక్రమాలతో మేము మా స్వచ్ఛంద సేవా సంస్థను నడుపుతున్నాము మా సంస్థ నందు 30 మంది అనాథ వృద్ధులు పిల్లలు ఉన్నారు. వారిని చేరదీర్చాము కానీ మా సంస్థకు స్థలం లేక ఎన్నో అవస్థలు పడుతున్నాము మా యందు దయవుంచి సంస్థకు స్థలాన్ని కేటాయించగలిగితే మరింత సేవా కార్యక్రమాలు నిర్వహించగలము ఈ స్థల కేటాయింపు గురించి ఖమ్మం మున్సిపల్ కమిషనర్, ఖమ్మం మేయర్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో షైనింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్ నిమ్మటూరి, సెక్రటరీ కొత్తపల్లి పుష్ప,సలహాదారులు దామర్ల సత్యం,స్టేట్ ఇన్చార్జులు మహమ్మద్ అలీ,గుడిపల్లి సతీష్, ధర్మరాజు వెంకటేశ్వర్లు,లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.



